ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

సోమవారం 4 ఆగస్టు 2025

అప్‌గ్రేడ్ కష్టాలు

ఆగిపోయిన నాడు-నేడు పనులు

- 335 మంది విద్యార్థులకు మూడే గదులు
- చెట్లకిందే పాఠాలు చెబుతున్న టీచర్లు
- పాఠశాలలో కొరవడిన మౌలిక వసతులు
- ఇబ్బంది పడుతున్న శాంతినగర్ స్కూల్ పిల్లలు



శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెట్లకిందే పాఠాలు చెబుతున్న టీచర్

సాధారణంగా దేంట్లోనైనా అప్‌గ్రేడ్ చేస్తే ఉన్న స్థితి నుంచి మెరుగైన స్థితిలోకి వచ్చే పరిస్థితి ఉంటుంది. కానీ ధర్మవరం శాంతినగర్‌లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. చక్కగా తరగతి గదుల్లో చదువుకునే పిల్లలను అప్‌గ్రేడ్ పేరుతో చెట్ల కిందకు తెచ్చి పడేశారు. దీంతో వారు అసౌకర్యాల మధ్య విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. అప్‌గ్రేడ్ చేసి మూడేళ్లు గడిచినా తరగతి గదులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ధర్మవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సిల్క్‌సిటీగా పేరుగాంచిన ధర్మవరం మున్సిపాలిటీలోని శాంతినగర్ ఉన్నత పాఠశాల సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. పాఠశాలలో 335 మంది విద్యార్థులు, 18 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. మూడే తరగతి గదులు ఉండటంతో టీచర్లు చెట్ల కిందే పాఠాలు చెబుతున్నారు. ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలగా 2022లో అప్‌గ్రేడ్ చేశారు. కానీ ఆమేరకు సౌకర్యాలు కల్పించలేకపోయారు. ప్రహరీ లేకపోవడంతో పాఠశాల ఆవరణలోకి పందులు, కుక్కలు, మూగజీవాలు యథేచ్ఛగా వస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాత్రి సమయాల్లో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. పాఠశాల ఆవరణలో నాడు-నేడు ఫేస్-2 కింద గత వైసీపీ పాలనలో రూ.2.26కోట్లతో నిర్మాణాలు చేపట్టారు. అయితే మెటీరియల్, సిమెంట్ సరఫరా లేకపోవడంతో తరగతి గదుల నిర్మాణాలు మధ్యలో నిలిపివేశారు. ఇంతవరకు తరగతి గదుల నిర్మాణాలను చేపట్టలేదు. టీచర్లు కూడా స్టాఫ్‌రూం లేక ఇబ్బంది పడుతున్నారు. హెచ్‌ఎం రూంలోనే సర్దుకుంటున్నారు. వంటగది కూడా లేదు. ఆగిపోయిన తరగతి గదుల నిర్మాణాలు ఉన్న చోటే ఏజెన్సీ నిర్వాహకులు భోజనం తయారు చేస్తున్నారు. రూ.12లక్షల వ్యయంతో తీసుకువచ్చిన ఆర్వో ప్లాంటు మూలనపడేశారు. పాఠశాలకు ఆనుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో విద్యార్థులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలలో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



శాంతినగర్‌లోని ప్రాథమిక పాఠశాలలోనే ఉన్నతపాఠశాలగా 2022లో అప్‌గ్రేడ్ చేశారు. అయితే పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు లేవు. ఈ విషయాన్ని విద్యాశాఖమంత్రి నారాలోకేశ్ దృష్టికి కూడా తీసుకెళ్లాం. డీఈఓ, ఇతర విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఈ పాఠశాలలో మౌలిక సౌకర్యాలపై ఎవరూ దృష్టి సారించలేదు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉంటేనే ఉపాధ్యాయులు బోధించే పాఠాలు బుర్రకు ఎక్కుతాయి. పాఠశాలలో వంటగది, మరుగుదొడ్లులేవు.

-ఉమాపతి, హెచ్‌ఎం, ఉన్నతపాఠశాల, శాంతినగర్



అర్ధాంతరంగా నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణం

పాఠాలు బుర్రకు ఎక్కడంలేదు



బడిలో గదులు లేకపోకపోవడంతో చెట్ల కిందనే చదువు చెబుతున్నారు. దీంతో పాఠశాల ముందు వెళ్లే ఆటోలు, ద్విచక్రవాహనాల శబ్దాలతో చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నాం. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు బుర్రకు ఎక్కడం లేదు. పాఠశాలలో మరుగుదొడ్లు కూడా లేవు. దీంతో ప్రాథమిక పాఠశాలలో ఉండే మరుగుదొడ్లను వినియోగించుకుంటున్నాం. అధికారులు స్పందించి నూతన తరగతి గదులను వెంటనే నిర్మించాలి.

-బద్రీనాథ్, విద్యార్థి, పదో తరగతి

వసతులు కల్పించాలి



ప్రాథమిక పాఠశాలలో ఉన్నతపాఠశాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ గదులు మూడే ఉండటంతో ఇబ్బందిగా ఉంది. తాగునీటి సౌకర్యం కూడా లేదు. ఆర్వో ప్లాంటు తెచ్చారు. అది కూడా మూలనకు పడేశారు. ఉన్న మూడుగదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో చదువుకునే సమయంలో పందులు, కుక్కలు, మూగజీవాలు పాఠశాలలోకి వస్తున్నాయి. దీంతో తీవ్ర అసౌకర్యంగా ఉంది.

- జయంతి, విద్యార్థిని, పదో తరగతి

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అర్జీలు ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రజలు ఇచ్చిన అర్జీల గురించి 1100కు ఫోన్ చేసి, పరిష్కారం గురించి తెలుసుకోవాలని తెలిపారు.

పంచాయతీరాజ్ శాఖలో సందడి

- పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- రికార్డులు సిద్ధం చేస్తున్న సిబ్బంది
- పదేళ్లు కావడంతో సాంకేతిక సమస్యలు
- సెలవురోజు సైతం పనిలో నిమగ్నం



ఎమ్ బుక్స్ పరిశీలిస్తున్న సబ్‌డివిజన్-2 డీఈ కృష్ణజ్యోతి

7

వీరంగం వీఆర్వోలపై చర్యలు



టీడీపీ నాయకులకు వేలు చూపుతూ దుర్భాషలాడుతున్న వీఆర్వోలు రంగనాథ్, నాగరాజు (ఫైల్)

రొళ్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వీరంగం సృష్టించిన మండలంలోని గుడ్డగుర్కి, రత్నగిరి వీఆర్వోలు రంగనాథ్, నాగరాజుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. మద్యంమత్తులో వారు గతనెల 31న హైవేలో వీరంగం సృష్టించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కృష్ణప్ప, యువ నాయకుడు రామకృష్ణను మద్యం మత్తులో వీఆర్వోలు నానాదుర్భాషలాడారు. అక్కడే ఉన్న గుడ్డగుర్కికి చెందిన విద్యుత్ లైన్‌మన్ ఇమ్రాన్.. వీఆర్వోలను అక్కడి నుంచి పంపించేశారు. అందుకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో జిల్లా ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. తహసీల్దార్ షెక్షావలి విచారణ చేసి ఆర్డీఓకు నివేదిక అందించారు. ఆ మేరకే వీఆర్వోలను ఆదివారం పెనుకొండ ఆర్డీఓకి సరండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రామీణ విద్యార్థులకు చేయూత

నెలకు రూ. 600 చొప్పున రవాణా భత్యం

పిల్లల గుర్తింపులో సమగ్రశిక్ష అధికారులు నిమగ్నం



అనంతపురం విద్య, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులలో దాదాపు నిరుపేద పిల్లలే చదువుతుంటారు. విద్యార్థుల సంఖ్య ఏడాదికేడాది తగ్గిపోతుండడంతో.. అదేస్థాయిలో రేషనలైజేషన్‌లో గ్రామాల్లో పాఠశాలలు మాయమైపోతున్నాయి. దీంతో కొన్ని ప్రాంతాలలో విద్యార్థులు కిలోమీటర్, రెండు, మూడు కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ పాఠశాలలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పిల్లలు రోజూ ఆటోలు, బస్సుల్లో వెళ్లి చదువుకోవడానికి తల్లిదండ్రులకు ఆర్థిక సమస్యలు ఇబ్బందికరంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గ్రామీణ పిల్లలు చదువుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణాభత్యం పేరుతో ఆర్థికసాయం అందించాలని నిర్ణయించింది.

నెలకు రూ.. 600 సాయం

ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్న విద్యార్థులకు మాత్రమే (మిగతా 7లో...)

అయ్యో పాపం



శ్వేత (ఫైల్)



మౌనిక (ఫైల్)

- నీటి దొనలో పడి ఇద్దరు చిన్నారుల మృతి
- అమ్మ మందలిస్తుందేమోనని స్నేహితురాలితో కలిసి అఘాయిత్యం (7లో...)

హత్యల కలకలం

- వేర్వేరు చోట్ల ఇద్దరి హత్య (వివరాలు 7లో)



జీపు బోల్తా

- ఇంజనీర్ మృతి

7 లో



గేమే నాయక్ తండా వద్ద సాగు చేసిన వంగ తోట

వంగకు ఊజీ బెంగ..

తుడిచి పెట్టుకుపోతున్న పంటలు

లబోదిబోమంటున్న రైతులు

తనకల్లు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వంగను ఊజీ మింగేస్తోంది. తోటలు తుడిచి పెట్టుకుపోతున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు వంకాయ పంట సాగుచేశారు. ఎకరాలో పంట సాగుకు రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు, కట్టెలు, పేపర్ తదితర వాటికోసం రూ.80 వేల నుంచి రూ.లక్షకుపైగా ఖర్చు చేస్తున్నారు. పంట కూడా ఏపుగా పెరిగి, మంచి దిగుబడి వచ్చింది. దిగుబడి సమయంలో ఊజీ సోకి, పంట మొత్తం పనికిరాకుండా పోతోంది. ఊజీ సోకిన కాయలను మార్కెట్‌కు తరలించినా, అడిగే నాథుడే లేడు. దీంతో ఊజీ నివారణకోసం రైతులు రూ.లక్షల పురుగు మందులు పిచికారీ చేసినా ప్రయోజనం దక్కట్లేదు. దీంతో పంటను పొలాల్లోనే వదిలేయాల్సిన దుస్థితి దాపురించింది. మండలవ్యాప్తంగా 500 ఎకరాలకుపైగా వంకాయ పంటను రైతులు వదిలేశారు. నష్టాల పాలయ్యారు.



ఊజీ సోకిన కాయలను పడేసిన దృశ్యం

కళ్లలోకి కంకరపొడి..!

- టిప్పర్లతో వాహనదారులకు అవస్థలు
- పట్టించుకోని పోలీసు, రవాణా అధికారులు

తనకల్లు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): టిప్పర్ డ్రైవర్ల నిర్లక్ష్యంతో వాహనదారులు, పాదచారుల కళ్లలోకి కంకరపొడి పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తనకల్లు మండలంలోని వివిధ గ్రామాల వద్ద హంద్రీనీవా కాలువకు లైనింగ్ పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. కొక్కంటిక్రాస్, చీకటిమానుపల్లి, మల్లిరెడ్డిపల్లి గ్రామాల వద్ద సిమెంటు ఇటుకల పరిశ్రమలు ఉన్నాయి. వీటికోసం ప్రతిరోజూ కదిరి ప్రాంతం నుంచి టిప్పర్లలో కంకర పొడిని తరలిస్తున్నారు. టిప్పర్లకు పైన ఎలాంటి పట్టలు, సంచులు కప్పడంలేదు. దీంతో టిప్పర్లు వేగంగా వస్తున్నప్పుడు గాలికి కంకర పొడి మొత్తం వెనుక వస్తున్న వాహనదారులు, పాదచారులు, రోడ్డుకిరువైపుల వ్యవసాయం చేసుకుంటున్న రైతులు, గొర్రెల కాపర్ల కళ్లలో పడుతోంది. కదిరి, నల్లచెరువు, తనకల్లు, కొక్కంటిక్రాస్ ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపుల ఉన్న దుకాణదారులు, కొనుగోలుదారులకు గాలికి కంకరపొడి కళ్లలో పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతూ శాపనార్థలు పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులుకానీ, ఆర్టీవో అధికారులుకానీ స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆదివారం మండ్లిపల్లి మిట్ట ప్రాంతంలో కంకరపొడి కళ్లలో పడడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురై, త్రుటిలో తప్పించుకున్నారు. దీంతో టిప్పర్ నిలిపి.. పట్ట కట్టుకోవాలని డ్రైవర్‌ను మందలించినా పట్టించుకోలేదు. గాలి వేగంగా ఉండడంతో కంకర పొడి కళ్లలో పడుతోంది. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.



మండ్లిపల్లి మిట్ట వద్ద టిప్పర్ డ్రైవర్‌ను మందలిస్తున్న ద్విచక్రవాహనదారులు

చికుబుకు రైలు ఎప్పుడో..?

- ఏళ్లు గడిచినా పూర్తికాని రైల్వేలైన్ పనులు
- సాగుతున్న రాయదుర్గం-తుమకూరు రైల్వే లైన్ నిర్మాణం
- 206 కిలోమీటర్లకుగాను 80 కిలోమీటర్లు పూర్తి
- కర్ణాటక భూసేకరణలో జాప్యమే కారణం..



పావగడ సమీపంలో జరుగుతున్న పనులు

మడకశిర, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా రాయదుర్గం - తుమకూరు రైల్వే లైన్ నిర్మాణ పనులు పూర్తి కాలేదు. 15 సంవత్సరాల కిందట ఈ రైల్వే లైన్ నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. అప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో రాయదుర్గం నుంచి కళ్యాణదుర్గం, కదిరిదేవరపల్లి వరకూ రైల్వేలైన్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయించి, రైలును పట్టాలు ఎక్కించారు. అయితే కదిరిదేవరపల్లి నుంచి తుమకూరు వరకు కర్ణాటక రాష్ట్రంలో భూసేకరణలో జాప్యం జరగడంతో కావడంతో పనుల్లో పురోగతి కొరవడింది. గత ఏడాది రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ రైల్వే లైన్ పనులు వేగంగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టారు. ఈక్రమంలోనే రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న గత ఏడాది ఈ పనులు పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. అయితే కొన్ని చోట్ల పనులు అనుకున్నంత వేగంగా సాగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకలో మధుగిరి, తుమకూరు తదితర ప్రాంతాల్లో భూసేకరణ కొలిక్కి వచ్చినప్పటికీ పనులు మాత్రం పూర్తి కాలేదు. కర్ణాటక ప్రాంతంలో జరిగే పనులకు టెండర్లు కూడా పిలవకపోవడంతో ఈ రైల్వేలైన్ పనులు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రైల్వే లైన్ నిర్మాణం పూర్తి అయితే...

రాయదుర్గం - తుమకురు రైల్వే నిర్మాణం పూర్తయితే ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి. ఆ ప్రాంతాల్లో రైతులు పండించిన పంటలను కర్ణాటకలోని తుమకూరు, బెంగళూరు ప్రాంతల మార్కెట్‌లకు తరలించే సౌలభ్యం ఏర్పడుతుంది. దీంతో రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశం కలుగుతుంది. కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి త్వరగా రైల్వే నిర్మాణం పూర్తి చేయించాలని ఇరు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

80 కిలోమీటర్లు పూర్తి



కె.రాంపురానికి ట్రయల్ రన్‌కు వచ్చిన రైలు (ఫైల్)

రాయదుర్గం- తుమకూరు రైల్వే నిర్మాణానికి 2011లో శంకుస్థాపన చేశారు. 2026లోగా పూర్తి చేయాల్సి ఉంది. రాయదుర్గం నుంచి కర్ణాటకలోని దొడ్డహళ్లి , కే రాంపురం వరకు రైల్వే లైన్ నిర్మాణం పూర్తి అయ్యింది. క్యాంపురం వరకు ట్రైల్ రన్ కూడా నిర్వహించారు. మొత్తం రైల్వే లైన్ నిర్మాణం 206 కిలోమీటర్ల చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు 80 కిలోమీటర్లు మాత్రమే పూర్తయ్యింది. పావగడ, మడకశిర , తుమకూరు నియోజకర్గాల్లో 49 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ పనులు జరుగుతున్నాయి. కర్ణాటకలోని మధుగిరి, తుమకూరు ప్రాంతాల్లో భూసేకరణ ఆలస్యం కావడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో నిర్మాణ వ్యయం కూడా పెరగనుంది. తుమకూరు- వసికెర మధ్య లో 11 కిలోమీటర్లు మాత్రమే రైల్వేలైన్ నిర్మాణపు పనులు ప్రారంభం అయ్యాయి. దావణగెరి రైల్వే లైన్ నిర్మాణం కోసం టెండర్లు పిలిచారు గాని తుమకూరు రాయదుర్గం రైల్వే నిర్మాణ పనులపై శ్రద్ధ చూపడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కె.రాంపురం రైల్వే జంక్షన్

త్వరగా పనులు పూర్తి చేయాలి



రైల్వేలైన్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. ఈ రైల్వేలైన్ పూర్తి అయితే సరిహద్దు ప్రాంతాల రైతులు, వ్యాపారులకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. రైతులు తాము పండించిన పంటలను కర్ణాటక ప్రాంతంలోని తుమకూరు, బెంగళూరు తదితర మార్కెట్లకు తీసుకుని వెళ్లి మంచి ధరకు విక్రయించుకునే అవకాశం ఉంటుంది. కేంద్రం ప్రభుత్వంపై స్థానిక పాలకులు ఒత్తిడి తేవాలి.

-నాగరాజు, రొళ్ల మండలం

జీపు బోల్తా : ఇంజనీర్ మృతి


బోల్తా పడిన జీపు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం-అనంతపురం జాతీయ రహదారిలోని వేపరాలక్రాస్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జీపు బోల్తా పడి కేబుల్ నెట్‌వర్క్ ఇంజనీర్ బసవరాజు(28) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కళ్యాణదుర్గం మండలం మానేపల్లికి చెందిన బసవరాజు వొడాఫోన్ కేబుల్ నెట్‌వర్క్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. గుండ్లపల్లి నుంచి ఆవులదట్లకు భోజనానికి వెళ్లొస్తానని జీపులో వస్తుండగా కల్వర్టు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ కమల్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. బసవరాజు కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు జాతీయ రహదారిపై గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు సంఘనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


రాజేష్(ఫైల్)

అమడగూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మహమ్మదాబాద్ పాత సచివాలయం వద్ద ఆదివారం రాజేష్ (36) అనే యువకుడు చీరతో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ధర్మవరం తారకరామాపురం కాలనీకి చెందిన రంగదామప్ప కుమారుడు అమడగూరు మండలంలో బావుచెరువుపల్లికి చెందిన శాంతమ్మ, కేశవయ్యల కుమార్తె శ్రావణిని ఏడు సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇతడు ధర్మవరంలో మగ్గం నేసుకుని జీవనం సాగించేవాడు. రెండు సంవత్సరాల నుంచి దంపతుల మధ్య గొడవలు మొదలై విడిపోయి ఒంటరి జీవనం సాగిస్తున్నారు. మృతుడి భార్య, తల్లిదండ్రులతో కలిసి బెంగుళూరులో ఉంటున్నారు. శనివారం రాజేష్ ధర్మవరం నుంచి మహమ్మదాబాద్‌కు వచ్చినట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించినట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఒత్తిళ్లు తట్టుకోలేక మరో యువకుడు..


హర్ష (ఫైల్)

నార్పల(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కాలనీలో హర్ష(25) అనే యువకుడు ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకెళితే.. కాలనీకి చెందిన ఆదెప్ప కుమారుడు హర్ష అనంతపురంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో గత మూడు సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. హర్ష కంపెనీ ఉద్యోగరీత్యా ఒత్తిళ్లు తట్టుకోలేక మనస్థాపానికి గురై ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడి మృతిని జీర్ణించుకోలేక తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి తండ్రి ఆదెప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

అయ్యో.. పాపం..!

నీటి దొనలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

అమ్మ మందలిస్తుందేమోనని స్నేహితురాలితో కలిసి అఘాయిత్యం


చిన్నారుల మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పాలు మాడిపోవడంతో తల్లి ఎక్కడ మందలిస్తుందోనని రాయదుర్గం మండలం టీ వీరాపురం గ్రామానికి చెందిన శ్వేత (13), స్నేహితురాలు మౌనిక (9)తో కలిసి నీటి దొనలో పడి ఆదివారం మరణించింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఈశ్వరప్ప, భవాని దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. చిన్న కుమార్తె శ్వేత 9వ తరగతి చదువుతుండేది. ఇంట్లో పాలు కాచిపెట్టమని శ్వేతకు తల్లి భవాని చెప్పి, పొలం పనులకు వెళ్లింది. శ్వేత పాలు కాచేందుకు పెట్టి మరచిపోయింది. అవి కాస్తా మాడిపోవడంతో స్టౌ ఆఫ్ చేసింది. అమ్మ ఎక్కడ మందలిస్తుందోనని భయపడిపోయింది. అదే ఊరికి చెందిన మిత్రురాలు, గంగాధర, మమత దంపతుల కుమార్తె మౌనికతో కలిసి గ్రామ సమీపంలోని గంగమ్మ దొన వద్దకెళ్లింది. ఇద్దరూ దొనలో పడి చనిపోయారు. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు ఇంటికొచ్చి కుమార్తె కోసం గ్రామంలో వెతకసాగారు. గొర్రెల కాపరులను అడగ్గా.. గ్రామ సమీపంలోని దొన వద్దకు వెళ్లారని చెప్పారు. దొనలో గాలించగా.. ఇద్దరి శవాలు బయటపడ్డాయి. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు.

20 మందిపై కేసు

గుత్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావా దేవీల వ్యవహారంలో దస్తగిరి అనే వ్యక్తిపై దాడికి పాల్పడిన 20 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణ శివారులోని జెడ్ వీరారెడ్డి కాలనీలో నివాసం ఉన్న దూదేకుల దస్తగిరి ఇంటిపై దాడికి పాల్పడి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. కడప జిల్లా బద్వేలుకు చెందిన ఉప్పర సుబ్బయ్య అనే వ్యక్తి వద్ద గుత్తి పట్టణానికి చెందిన దస్తగిరి రూ.37.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అనంతరం సుబ్బయ్యకు తన ఇంటితో పాటు ఖాళీ స్థలాన్ని రిజిష్టర్ చేయించాడు. మూడు సంవత్సరాలలోపు అప్పు తీర్చని పక్షంలో తన ఆస్తిని స్వాధీన పరుచుకోవాలని అగ్రిమెంటు రాయించుకున్నారు. ఈ విషయమై గత నాలుగు నెలలుగా ఇల్లు తమకు స్వాధీన పరచాలని పలుమార్లు చెప్పారు. పట్టించుకోకపోవటంతో దస్తగిరిపై దాడికి పాల్పడ్డారని సీఐ తెలిపారు. దస్తగిరి ఫిర్యాదు మేరకు తొండపాడుకు చెందిన ఓంప్రకాష్, శ్రీపురానికి చెందిన శివ, జక్కలచెరువుకు చెందిన సూర్యప్రతాప్, కొంగనపల్లి గోవర్ధన్, గోవిందు, గౌరీ శంకర్‌తో పాటు మరో 14 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఎలక్ట్రికల్ రీవైండింగ్‌లో హౌస్‌వైరింగ్, మోటార్ రీవైండింగ్‌లో స్వయం ఉపాధి కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీసెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. అధిక నాణ్యతగల సాంకేతికత, సౌకర్యాలతో హౌసింగ్ వైరింగ్, ఎలక్ట్రికల్ నిర్వహణ, ఎలక్ట్రికల్ పరికరాల రిపేరీలు, ఫ్యాన్ల రిపేరీ, మోటార్ రీవైండింగ్‌లలో నాణ్యమైన శిక్షణ 45 రోజుల పాటు ఇస్తామని తెలిపారు. 18-40 సంవత్సరాల వయస్సులోపు ఉన్న నిరుద్యోగ యువత ఐదో తరగతి, పదోతరగతి, ఇంటర్, ఐటీఐ చదివి ఉన్న ఉమ్మడి జిల్లా అభ్యర్థులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9704407134, 7780752418లను సంప్రదించాలని పేర్కొన్నారు.

పంచాయతీరాజ్ శాఖలో సందడి

- పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- రికార్డులు సిద్ధం చేస్తున్న సిబ్బంది
- పదేళ్లు కావడంతో సాంకేతిక సమస్యలు
- సెలవురోజు సైతం పనిలో నిమగ్నం


ఈఈ విభాగంలో రికార్డులను పరిశీలిస్తున్న సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో ఆదివారం కూడా సందడిగా కనిపించింది. సెలవు రోజు సైతం సిబ్బంది విధుల్లో నిమగ్నమయ్యారు. పది సంవత్సరాల క్రితం చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 21 శాతం బిల్లుల చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో సిబ్బంది శనివారం నుంచే బిల్లుల అప్‌లోడ్‌లో నిమగ్నమయ్యారు. వీలైనంత త్వరగా పెండింగ్ బిల్లులకు సంబంధించిన ఫైల్స్ అప్‌లోడ్ పూర్తయ్యేలా చూడాలని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. దీంతో సిబ్బంది మొత్తం ఆదివారం సెలవు రోజు అయినప్పటికి కార్యాలయంలో వర్కింగ్ రోజు మాదిరిగానే కనిపించింది. 2014-15లో చేపట్టిన పనులకు సంబంధించి అప్పట్లో చేపట్టిన పనులకు 21 శాతం బిల్లులు పెండింగ్ ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తరువాత పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌కు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఈ ఏడాది జనవరిలో దాదాపు రూ.3 కోట్ల వరకు బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఏప్రిల్‌లో మొత్తం బిల్లులు మంజూరయ్యాయి. రెండో విడత బిల్లుల చెల్లింపులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.9 కోట్ల బిల్లుల చెల్లింపులకు ప్రక్రియ పూర్తి చేయాలని ఈఎన్‌సీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం సెలవురోజు అయినప్పటికి సిబ్బంది అందరిని అందుబాటులో ఉంచుకొని బిల్లుల అప్‌లోడ్ చేయడంలో నిమగ్నమయ్యారు. పదేళ్ల క్రితం పనులు కావడంతో ఎమ్.బుక్స్ దొరక్క కొందరు ఇబ్బంది పడుతున్నారు. దీంతో పాటు కొన్నింటికి సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. కొన్ని పనులకు సంబంధించి అప్‌లోడ్ చేసే సమయంలో రివైజ్ ఎస్టిమేట్స్ అప్‌లోడ్ చేయాలని సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఇలాంటి వాటికి సంబంధించి బిల్లుల చెల్లింపులకు కొంత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొంది వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు కోరుతున్నారు. మొదటి విడతలో రికార్డులు అప్‌లోడ్ చేసిన మూడు నెలల్లో ఖాతాల్లోకి సొమ్ము చేరింది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు



2014-15 సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి అప్పట్లో 21 శాతం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం దశల వారిగా వాటిని క్లియర్ చేయడానికి చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ఈ ఏడాది మొదటిలో అనుమతి ఇవ్వడంతో అప్పట్లో అప్‌లోడ్ చేసిన వాటికి సంబంధించి దాదాపు రూ.3 కోట్ల వరకు చెల్లింపులు జరిగాయి. అదే విధంగా ఇంకా పెండింగ్ ఉన్నవాటిని కూడా క్లియర్ చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. దీంతో ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా నివేదికలు తయారు చేస్తున్నాం. వీలైనంత త్వరగా ప్రక్రియను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

-ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఈ, పంచాయతీరాజ్ శాఖ

గ్రామీణ విద్యార్థులకు చేయూత

(5వ పేజీ తరువాయి)

రవాణాభత్యం కింద ఆర్థిక సాయం అందిస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాల, మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలలకు రోజూ రాకపోకలు చేస్తూ చదువుకుంటున్న విద్యార్థులకు రవాణాభత్యం వర్తిస్తుంది. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.600 ఇస్తారు. ఇలా పదినెలలు పాటు ఏడాదికి రూ.6వేలు ప్రతి విద్యార్థికి ఆర్థిక సాయం ప్రభుత్వం అందించనుంది. ఈ మేరకు రాష్ట్ర సమగ్రశిక్ష ఎస్పీడీ ఉత్తర్వులు ఇచ్చారు. ఎస్ఎస్ఏ అధికారులు జిల్లాలో రవాణాభత్యం అమలుకు చర్యలు చేపడుతున్నారు. దీనిపై ఇటు విద్యార్థులు, తల్లిదండ్రులు అటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బడుగుల పిల్లలకు వరం



రవాణా భత్యం అందించడం ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద విద్యార్థులకు వరం. కూటమి ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేద విద్యార్థుల చదువుల పట్ల ఇంత ప్రేమ చూపడం ఆనందదాయకం. నిబంధనల మేరకు అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి రవాణా భత్యం అందేలా అధికారులు చూడాలి.

- బండారు శంకర్, జాతీయ ఉపాధ్యక్షుడు, ఎంఈఎఫ్

డ్రాపౌట్స్ తగ్గుతారు



చాలామంది విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి బడులకు వస్తున్నారు. రోజూ డబ్బులు పెట్టి బడికి రావాలంటే తల్లిదండ్రులకు భారమవుతోంది. డబ్బులు ఇవ్వకపోతే పిల్లలు బడికి రావడానికి ఇష్టపడరు. దీంతో డ్రాపౌట్స్ ఎక్కువయ్యే అవకాశం ఉండేది. ఇపుడు రవాణాభత్యం ప్రభుత్వమే చెల్లిస్తుంది. దీంతో తల్లిదండ్రులకు డబ్బు సమస్య ఉండదు. పిల్లలు రోజూ బడికి వస్తారు, డ్రాపౌట్స్ తగ్గే అవకాశం ఉంటుంది.

- రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూ

అర్హులను గుర్తిస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు రవాణా భత్యం ఎంతో ఉపయుక్తం. ఇందుకోసం నిబంధనలు ఉన్నాయి. ఆ మేరకు అర్హత గల విద్యార్థులను గుర్తిస్తున్నాం. ఇప్పటికే ఎంఈఓలు, సీఆర్‌టీసీలతో సమావేశం నిర్వహించి ఆదేశాలు ఇచ్చాం. ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా తొలుత సీఆర్టీసీలు పాఠశాలల వారిగా పిల్లలను గుర్తిస్తారు. అక్కడి నుంచి ఆ పాఠశాల హెచ్ఎం లాగిన్‌కు పంపుతారు. అనంతరం ఎంఈఓల లాగిన్‌కు పంపి.. వారు పరిశీలించాక ఎస్ఎస్ఏకు విద్యార్థుల వివరాలు పంపుతారు. ఇక్కడి నుంచి ప్రభుత్వానికి నివేదిస్తాం. తర్వాత రవాణాభత్యం డబ్బులు మంజూరవుతాయి.

- శైలజ, ఏపీసీ, సమగ్రశిక్ష

హత్యల కలకలం..

వేర్వేరు చోట్ల ఇద్దరి హత్య


దాదాపీర్ (ఫైల్)


సన్నక్క(ఫైల్)

హిందూపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఒకేరోజు రెండు హత్యలు కలకలం రేపాయి. పట్టణంలోని గుడ్డం ప్రాంతానికి పాత నేరస్తుడు దాదాపీర్ (35)ను ఆదివారం గుర్తు తెలియని దుండుగులు ఆటోలో తీసుకెళ్లి పట్టణ సమీపంలోని లేపాక్షి మండల పరిధి తిలక్ నగర్ వద్ద కత్తులతో పొడిచి హతమార్చారు. అటుగా వెళ్లేవారు గమనించి లేపాక్షి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హత్యాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. దాదాపీర్‌పై పది కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. గుడ్డం ప్రాంతానికి చెందిన వారి వద్ద రూ.10 వేలు అప్పు తీసుకుని, తిరిగి చెల్లించనందుకు గొడవపడి అప్పిచ్చినవారే హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దాదాపీర్ మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని, విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

పరిగిలో మహిళ..

శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పరిధి బిందు నగర్‌లో సన్నక్క (45)ను శనివారం రాత్రి కర్రతో కొట్టి హత్య చేశారు. పరిగి ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని రొద్దం మండలం తురకలాపట్నం గ్రామానికి చెందిన సన్నక్కను సోమందేపల్లి మండలం చంద్రకచెర్ల వాసి అంజప్పకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. సన్నక్క 11 ఏళ్లుగా భర్తకు దూరంగా బిందునగర్‌లోని అద్దె ఇంట్లో నివాసం ఉండేది. హిందూపురం మండలం చౌళూరుకి చెందిన బోయ నవీన్‌తో సహజీవనం చేస్తుండేది. ఈమె తూముకుంట చెక్‌పోస్టులోని ఒక గార్మెంట్స్ పరిశ్రమలో పనిచేస్తుండేది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఆమె ఇంటి సమీపంలోనే కర్రతో కొట్టి హత్య చేశారు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు.. ఆమె భర్త అంజప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఒకరిని అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు తెలిసింది.

ఆదర్శం.. అనంత అర్బన్‌బ్యాంకు

ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ చైర్మన్లు ముంటిమడుగు, నెట్టెం

పేదల బ్యాంకుగా సేవలందిస్తాం: జేఎల్

ఘనంగా 109వ మహాజనసభ


జ్యోతి వెలిగిస్తున్న చైర్మన్లు, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): దివాలా తీసే పరిస్థితి నుంచి రూ.900కోట్ల టర్నోవర్‌తో అర్బన్ బ్యాంకుగా రూపాంతరం చెందే స్థాయికి తీసుకువచ్చిన అనంతపురం అర్బన్‌బ్యాంకు.. బ్యాంకింగ్ రంగానికే ఆదర్శంగా నిలుస్తోందని ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ చైర్మన్లు ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేశులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సుభాష్‌రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయ భవన్‌లో అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 109వ మహాజనసభ చైర్మన్ జేఎల్ మురళీధర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కేశవరెడ్డి, వెంకటేశు జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించి మాట్లాడుతూ...అర్బన్ బ్యాంకు కార్యకలాపాలు బ్యాంకర్లకు ఆదర్శంగా నిలుస్తున్నాయని.. చైర్మన్ జేఎల్ మురళీధర్ కృషి అభినందనీయం అన్నారు. జాతీయ బ్యాంకులతో పోటీ పడుతూ అగ్రస్థానంలో నిలపడం శుభపరిణామమన్నారు. అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ మాట్లాడుతూ.. అనంతపురం పేద ప్రజల ఆర్థిక పురోగతికి అండగా నిలవడమే తమ బ్యాంకు ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. సామాన్యులకు మరిన్ని సేవలు చేరువ చేయడానికి సమష్టి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ చైర్మన్లు ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేశును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి, అర్బన్ బ్యాంకు సీఈఓ విజయభాస్కర్, వైస్‌చైర్మన్లు వడ్డే సుబ్రమణ్యం, చంద్రశేఖర్, డైరెక్టర్లు సుంకర రమేష్, కృష్ణకుమార్, రమణయ్య, గోల్డ్‌బాషా, రొళ్ల భాస్కర్, రామాంజనేయులు, అనిల్‌నాయుడు పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లాస్థాయి క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 5వతేదీ నుంచి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అండర్-22 విభాగంలో బాల, బాలికలకు జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 5న కబడ్డీ, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్ పోటీలు అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో ఉంటాయని తెలిపారు. ఈనెల 6న వాలీబాల్, అథ్లెటిక్స్, ఖో-ఖో, ఆర్చరీ పోటీలు నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో జరుగుతాయన్నారు. అదే రోజు హాకీ పోటీలు ఆర్ట్స్ కాలేజీలో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు: 9849421462, 08554-353223లను సంప్రదించాలని తెలిపారు.

నిబద్ధత గల విమర్శకుడు ఆనందరావు

ఆలోకనమ్ పుస్తకావిష్కరణ సభలో వక్తలు


ఆలోకనమ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నిబద్ధత కలిగిన సాహితీ విమర్శకుడు డాక్టర్ కల్లూరి ఆనందరావు అని పలువురు వక్తలు కొనియాడారు. విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి, కళా జ్యోత్స్న సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో డాక్టర్ కల్లూరి ఆనందరావు రచించిన 'ఆలోకనమ్' పుస్తకావిష్కరణ సభను నిర్వహించారు. డాక్టర్ శాంతినారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విమర్శకు రాయలసీమ ప్రధాన భూమిక పోషించిందన్నారు. డాక్టర్ కల్లూరి ఆనందరావు రచించిన ఆలోకనమ్ విమర్శ గ్రంథంలో దళిత బహుజన సాహిత్య విమర్శ చాలా లోతుగా కనిపిస్తుందని కొనియాడారు. సీపీ బ్రౌన్, వేమన సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావడమే కాకుండా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని పేర్కొన్నారు. శాంతినారాయణ మాట్లాడుతూ... విమర్శలో తనదైన దృక్పథంతో ప్రయాణిస్తున్న గొప్ప విమర్శకుడు కల్లూరి ఆనందరావు అని, దళిత జీవితం ప్రధానంగా ఆలోకనం విమర్శ గ్రంథంలో కనిపిస్తుందన్నారు. అనంతరం డాక్టర్ కల్లూరి ఆనందరావు, డాక్టర్ నందిరాజు కళ్యాణి దంపతులు అతిథులను శాలువా, పుష్పగుచ్చాలతో సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్త తూముచర్ల రాజారామ్, ఉప్పరపాటి వెంకటేశులు, రంగనాయకులు, డాక్టర్ నానీల నాగేంద్ర, కల్లూరి యశస్వి, అంకె శ్రీనివాసులు, యోగేశ్వరనాయుడు, జూటూరు షరీఫ్, టీవీ రెడ్డి, చెట్ల ఈరన్న, ప్రకాష్ బాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగా పోటీలు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గవిమఠం ఉత్తరాధికారి

ఉరవకొండ,ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి యోగాసన పోటీలు ఉత్సాహంగా సాగాయి. యోగాసన స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి 240 మంది దాకా పాల్గొన్నారు. పలువురి యోగాసనాలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యోగాసన స్పోర్ట్స్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పరిశీలకుడు బద్రీనాథ్, ఆయూర్ సంస్థ ప్రతినిధులు వెంకట్, సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఆన్-కాల్-డ్రైవర్‌గా పనిచేయడానికి అర్హులైన డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని డిపోమేనేజర్ ఇనయతుల్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. 45 సంవత్సరాలలోపు ఉండి, హెవీ మోటార్ డ్రైవింగ్ లైసెన్సు కలిగిన 18 నెలల పైన బస్సు నడిపిన అనుభవం ఉన్నవారు అర్హులని అన్నారు. ఆర్టీఓ కార్యాలయం నుంచి క్లియరెన్స్ పొందిన ధ్రువపత్రం అందచేయాలని, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు ఒరిజినల్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకుని డిపోలో హాజరుకావాలని అన్నారు. మెడికల్ చెకప్ అనంతరం అర్హులను విధుల్లోకి తీసుకుంటామని వివరించారు. ఎంపికయిన డ్రైవర్లకు రోజువారి వేతనం చెల్లిస్తామని పేర్కొన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

మడకశిర రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని డి.అచ్చంపల్లికి చెందిన మహిళ రాధమ్మ మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు అపహరణకు గురైంది. ఆదివారం బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని బంధువు ఇంటిలో శనివారం రాత్రి జరిగిన శుభ కార్యక్రమం ముగించుకుని ఇంటిలోకి వచ్చి నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి తన మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని పరుగులు తీసినట్లు తెలిపారు. బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

వాహనం కిందపడి చిన్నారి మృతి

యాడికి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బొలెరో వాహనం వెళ్లడంతో పద్మజ (2) అనే చిన్నారి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని లక్ష్ముంపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్ముంపల్లికి చెందిన శేఖర్, రమాదేవి దంపతులు వ్యవసాయం ద్వారా జీవనం పొందుతున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, రెండేళ్ల కుమార్తె పద్మజ ఉన్నారు. ఆదివారం వారి సొంత వ్యవసాయ పొలంలో టమోట పంట దిగుబడిని బొలెరో వాహనంలో తీసుకొని మార్కెట్‌కు వెళుతున్న సమయంలో ఇంటివద్దకు వెళ్లారు. తిరిగి టమోటాల విక్రయానికి ప్యాపిలికి బయలుదేరే సమయంలో చిన్నారి పద్మజ బొలెరో కింద ఉండడాన్ని గమనించకుండా డ్రైవర్ వాహనాన్ని ముందుకు పోనివ్వడంతో తీవ్రంగా గాయపడింది. చిన్నారిని చికిత్స నిమిత్తం రాయలచెరువుకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పద్మజ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఇతర బ్యాంకులకు దీటుగా సేవలు

● రాజశేఖర్‌రెడ్డి, ఏపీజీబీ మేనేజర్, నల్లగుట్లపల్లి



తనకల్లు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఇతర వాణిజ్య బ్యాంకుల సేవలతో పోటీగా తమ బ్యాంకు నిలుస్తోందని మండల పరిధిలోని ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, నల్లగుట్ట పల్లి బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రశ్న: వాణిజ్య బ్యాంక్‌లు అందిస్తున్న సేవలు(రుణాలను) మీరు అందిస్తున్నారా?

జవాబు: ఇతర వాణిజ్య బ్యాంకులతో సమానంగా అన్నిరకాల ప్రభుత్వ సేవలను అందజేస్తున్నాం. విద్య, గృహం, వాణిజ్యం, వ్యవసాయం, మహిళా సంఘాలు, నిరుద్యోగులు తదితర అన్ని రకాల వారికి అర్హత, అవకాశాన్ని బట్టి రుణాలు ఇస్తున్నాం.

ప్రశ్న: పంట రుణాలు ఎన్ని?

జవాబు: మా బ్యాంక్ పరిధిలో 3,500 పంట రుణాలు ఉన్నాయి. ఇప్పటివరకు 2,700 రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకున్నారు.

ప్రశ్న: రెన్యువల్ సమయం ఇంకా ఉందా?

జవాబు: కొంతమంది ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో పంటరుణాలు పొందారు. రబీలో సైతం పంట రుణాలను రెన్యువల్ చేస్తున్నాం.

ప్రశ్న: డి. పట్టా భూములకు రెన్యువల్‌లో అదనంగా పంట రుణం పెంచుతున్నారా?

జవాబు: మా బ్యాంకు ఉన్నతాధికారులతో సంప్రదించి మంజూరు చేస్తున్నాం.

ప్రశ్న: రుణాలు పొందిన రైతుల పంటలకు ఇన్సూరెన్స్ చేస్తున్నారా?

జవాబు: ప్రభుత్వ నింబంధనల మేరకు జూలై 15లోగా రుణాలు రెన్యువల్ చేసిన రైతుల పంటలకు ఇన్సూరెన్స్ చెల్లించాం. ఆ పైన రుణాలు రెన్యువల్ చేసిన వారి పంటలకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ గడువు పొడిగించవచ్చు.

'వ్యసనాలకు బానిస కావొద్దు'

ధర్మవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చెడువ్యసనాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హ్యూమన్ రైట్స్ కమిషన్ ఇండియా నేషనల్ సీనియర్ సెక్రటరీ భాస్కర్ నాయుడు సూచించారు. వాటి నుంచి బయటపడాలంటే అధికశక్తి ప్రాణాయామం, ధ్యానం చాలా అవసరమని అన్నారు. ఇంటర్నేషనల్ ఐహెచ్‌ఆర్‌సీ ఇండియా వారి ఆదేశాల మేరకు ఆయన ఆదివారం సబ్‌జైలులో ఖైదీలతో సమావేశమయ్యారు. మానసిక ప్రశాంతతను చేకూర్చే విధంగా యోగా, ప్రాణాయామం, ధ్యానం అలవరచుకోవాలని ఖైదీలకు ఆయన సూచించారు. దీంతో మనిషిలో విజ్ఞత పెరిగి, తప్పు నిర్ణయాలు తీసుకోకుండా, ద్వేషాలకు, అసూయలకు, కుట్రలకు వెళ్లకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఆర్ సీఎస్‌డీటీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు నితీశ్ చౌదరి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు కంటి చూపు ప్రసాదించడం వరం

ధర్మవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పేదలకు కంటి చూపు ప్రసాదించడం ఓ వరం లాంటిదని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శీలా నాగేంద్ర, జయరాం పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్, బెంగళూరుకు చెందిన నేత్రజ్యోతి కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వనివారణ సంస్థ సంయుక్తంగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 46 మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేసినట్టు ఫౌండేషన్ అధ్యక్షుడు నాగేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ కోశాధికారి వంకదారి మోహన్, ఉపాధ్యక్షులు సుకుమార్, క్యాంప్ చైర్మన్ సికిందర్, పీఆర్‌ఓ రాధాకృష్ణ, సభ్యులు పోలా ప్రభాకర్, చాంద్‌బాషా, కేతా లోకేశ్, సీకే రామాంజినేయులు పాల్గొన్నారు.

జడ్పీ మాజీ చైర్మన్‌కు పరామర్శ



ఓబిరెడ్డిని పరామర్శిస్తున్న చిలకం మధు

ధర్మవరం రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల గ్రామానికి చెందిన జడ్పీ మాజీ చైర్మన్ ఓబిరెడ్డి ఇటీవల హైదరాబాద్‌లో మోకాలి శస్త్ర చికిత్సలు చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆదివారం చిగిచెర్లలోని ఓబిరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆయన గ్రామంలో పర్యటించి పలు సమస్యలను ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ముఖ్యంగా సీసీరోడ్లు, మౌలిక సదుపాయాలు లేవని గ్రామస్థులు విన్నవించారు. దీంతో ఆయన అధికారులతో మాట్లాడి సమస్యలన్నీ పరిష్కారించేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట మార్కెట్‌యార్డు డైరెక్టర్ రాఘవరెడ్డి, చిలకం గోవిందరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారం



తెగిపోయిన విద్యుత్ వైర్లను సరిజేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

ధర్మవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చంద్ర బాబునగర్‌లో తిక్కస్వామి గుడి వద్ద విద్యుత్ సమస్యను టీడీపీ నాయకులు పరిష్కరించారు. తమ ప్రాంతంలో విద్యుత్ వైరు తెగి కింద పడి ఉన్న విషయాన్ని వారం రోజుల క్రితం పట్టణంలోని రెండో వార్డులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ నిర్వహించిన 'మీ సమస్య-మా బాధ్యత' కార్యక్రమంలో ప్రజలు తెలియజేశారు. ఆయన సూచనల మేరకు ఆదివారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, రెండో వార్డు ఇన్‌చార్జ్ మాబు, నాయకులు రాజ్‌కుమార్ నాయుడు, ఐటీడీపీ పట్టణ అధ్యక్షుడు చెలిమి శివరాం ట్రాన్స్ కో సిబ్బందిని పిలిపించి తెగిపోయిన విద్యుత్ వైర్లకు మరమత్తులు చేయించి సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానికులు పరిటాల శ్రీరామ్, టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కరువు మండలంగా ప్రకటించినా..

● ప్రత్యేక రాయితీలు శూన్యం
● రీషెడ్యూల్‌కూ ఒప్పుకోని బ్యాంకులు
● ఆందోళనలో అన్నదాతలు



తనకల్లులోని స్టేట్ బ్యాంకు

తనకల్లు, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అతి పెద్ద రెండో మండలంగా తనకల్లుకు పేరుంది. ఈ మండలంలో చెప్పుకోదగిన పరిశ్రమలు గానీ, నీటి పారుదల ప్రాజెక్టులు గానీ లేవు. 80శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అందులోనూ 60శాతం మంది వర్షాధార వ్యవసాయమే. గత యేడాది పంటలు పండక పోవడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. దీంతో ప్రభుత్వం సత్యసాయి జిల్లాలో తనకల్లు, రొద్దంను కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ ప్రకటన వెలువడగానే ఇక్కడి రైతుల్లో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం రాయితీలు, వ్యవసాయానికి పెట్టుబడులు అందుతాయని ఆశించారు. అయితే వారి ఆశలు ఆడియాశలయ్యాయి. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించినా, నేటికీ ప్రత్యేకంగా ఎలాంటి రాయితీలు (సదుపాయాలు) ప్రకటించలేదు. మండలంలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండి యా, యూనియన్ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ఏడీసీసీ బ్యాంక్ లు ఉన్నాయి. మండలంలోని రైతులు తమకు కేటాయించిన బ్యాంక్‌ల్లో పంట రుణాలు పొందారు. పంట రుణాలతోపాటు దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలు, ఇతర రుణాలు కూడా తీసుకున్నారు. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించడంతో తాము తీసుకున్న రుణాలకు కనిష్టంగానైనా కొంతకాలం వాటి చెల్లింపులను వాయిదా వేస్తారని ఆశించారు. అయితే ప్రభుత్వం అలాంటి ప్రకటనలు చేయక పోవడంతో రైతుల్లో ఆగ్రహ జ్వాలలు వెలువడుతున్నాయి. పంట రుణాలను ప్రభుత్వం గరిష్టంగా రూ.3లక్షలకు మించి ఇవ్వడంలేదు. రూ. మూడు లక్షలు దాటితే రైతులు తమ భూములను మార్ట్ గేజ్(తాకట్టు) చేయాలన్న నిబంధనను బ్యాంక్ అధికారులు విధిస్తున్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఓవైపు ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించినా, ఎలాంటి సదుపాయాలు, రాయితీలు కల్పించడంలేదు. అంతేకాకుండా జిల్లా ఉన్నతాధికారు లైనా మండలంలో పర్యటించి, రైతుల పరిస్థితులు గమనించలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రత్యేకంగా జిల్లాకు, నియోజకవర్గానికి, మండలానికి ప్రత్యేక పరిశీలకులను(అధికారులను) నియమించినా, వారు కూడా మండలంలో పర్యటించి, అన్నదాతల సమస్య లు ఎలా ఉన్నాయో అడిగిన పాపాన పోలేదు. ఇదే అదునుగా బ్యాంక్ అధికారులు తమ ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రతినిధులు స్పందించి కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిన మండలాలోనైనా అన్నదాతలకు రాయితీలు, రుణాల రీషెడ్యూల్ ప్రకటించాలని, విత్తనాలు, ఎరువులు ఇప్పించాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

రుణాలను రీషెడ్యూల్ చేయడంలేదు



ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించినా, బ్యాంక్ అధికారులు పంట రుణాలను రీషెడ్యూల్ చేయడంలేదు. పంట రుణాలను రీషెడ్యూల్ చేయమని ప్రాధేయపడితే అన్నిరికార్డులు తీసుకుని ఉన్నతాధికారులకు పంపామని, ఇంకా అనుమతులు రాలేదంటూ రైతులను బ్యాంక్ చుట్టూ తిప్పుకుంటున్నారు. ప్రభుత్వం రీషెడ్యూల్ చేయమన్నప్పుడు బ్యాంక్ అధికారులు ఎందుకు చేయడంలేదో అర్థం కావడంలేదు.

-విశ్వనాథ్‌రెడ్డి, ఉప్పోలపల్లి

నెలరోజులుగా తిరుగుతున్నా



నా పంట రుణాన్ని రీషెడ్యూల్ చేయమని నెలరోజులుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా. పట్టించుకునే నాథుడే లేడు. అన్ని రికార్డులు తీసుకుని పైకి పంపామని ఇక్కడి బ్యాంకు అధికారులు చెబుతున్నారు. అసలే కరువు, ఆపై చిన్నారుల చదువులు, కుటుంబపోషణ చూసుకుంటూ, తిరిగి పంటలు సాగు చేయాలి. పెట్టుబడులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. మా పంట రుణాలు రీషెడ్యూల్ అవుతాయో లేదో మరి.

- గంగాధర్, పరాకువాండ్లపల్లి

ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం

రైతులందరూ పంటరుణాలను రెన్యువల్ చేసుకుంటున్నారు. రీషెడ్యూల్ కావాలని అడిగిన రైతుల వివరాలను అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను ఉన్నతాధికారుల అనుమతులకు పంపాం. 20 రోజులుగా ఉన్నతాధికారుల అనుమతుల కోసం వేచి చూస్తున్నాం. అనుమతులు రాగానే రీషెడ్యూల్ చేస్తాం. -మురళీకుమార్, మేనేజర్, స్టేట్ బ్యాంక్, తనకల్లు

మహిళలకు శక్తి కవచం

● విస్తృత అవగాహన కల్పిస్తున్న జిల్లా పోలీసులు



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేటప్పుడు ఆకతాయిలు వెంటపడి వేధించినా, ఆటపట్టించినా బాలిక లు, యువతులు కన్నీళ్లు పెట్టుకోవడం పాతమాట. సివంగిలా ఎదురుతిరిగి బుద్ధిచెప్పాలని నేటి బాలికలు, యువతులకు ప్రభుత్వం నేడు అవగాహన కల్పిస్తోంది. అత్యవసరమైతే చేతికి పనికల్పించాలని వారిలో నిగూఢంగా ఉన్న శక్తిని తట్టిలేపుతోంది. దానికి తోడుగా శక్తియాప్ ఉందని బాలబాలికలకు, యువతులకు, మహిళా లోకానికి జిల్లా పోలీసులు గుర్తు చేస్తున్నారు. దీనిపై జిల్లా అంతటా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటుచేసి బాలికలకు, విద్యార్థినులకు భరోసా కల్పిస్తున్నారు జిల్లా ఎస్పీ రత్న.

శక్తి యాప్ ఉంటే రక్షణ మీ వెంటే..

శక్తియాప్ మొబైల్‌లో ఉంటే బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. అత్యవసర సమయాల్లో ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే మీరు ప్రమాదంలో ఉన్నారన్న విషయం పోలీసు కంట్రోల్‌రూంకు తెలిసిపోతుంది. మీ మొబైల్ లోకేషన్ గుర్తించి హుటాహుటిన పోలీసులు అక్కడకు చేరుకుంటారు. ఆపదలో ఉన్న వారిని రక్షిస్తారు. అలాగే యాప్‌లోని 112 బటన్ నొక్కితే కంట్రోల్ రూంకు కాల్ వెళుతుంది. తప్పిపోయిన పిల్లల వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు ఫొటో అప్‌లోడ్ చేయగానే పోలీసుశాఖ అప్రమత్తంగా అవుతుంది.

సురక్షిత ప్రయాణానికి తోడ్పాటు

చాలామంది రాత్రివేళల్లో ఒంటరిగా ప్రయాణం చేయాల్సి వస్తుంది. అలాంటి వారు సేఫ్ ట్రావెల్ అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకుంటే, వారి ప్రయాణ మార్గాన్ని పోలీసులు నిశితంగా గమనిస్తుంటారు. వారు ఉన్న ప్రాంతం నుంచి ఎక్కడికి వెళుతున్నారో ఆ వివరాలతో పాటు వాహనం వివరాలు కూడా నమోదుచేయాలి. మధ్యలో ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే పోలీసులు వస్తారు. వా ప్రయాణం సురక్షితంగా సాగుతుంది.

విస్తృత ప్రచారం

రెండు నెలల నుంచి సత్యసాయిజిల్లా పోలీసులు శక్తియాప్‌పై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఎస్పీ రత్న ఆదేశాలతో మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో వివిధ బృందాలు మహిళల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. ఫోన్లలో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. సేవలు తెలియజేస్తున్నారు. బాలబాలికలకు మంచిచెడు స్పర్శల గురించి వివరిస్తున్నారు. సైబర్‌నేరాలపై అప్రమత్తం చేస్తున్నారు.

మహిళల భద్రతే ధ్యేయం



అవగాహన కల్పిస్తున్న ఎస్పీ (ఫైల్)

జిల్లాలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. పాఠశాలలు, కళాశాలలు, బాలికల వసతిగృహాలు, పబ్లిక్ ప్రవేట్ ప్రదేశాల్లో శక్తి యాప్‌పై శక్తిటీంల ద్వారా విస్తృతప్రచారం కల్పిస్తున్నాం. గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌లపై బాలికలకు అవగాహన కల్పిస్తున్నాం. - ఎస్పీ రత్న, శ్రీసత్యసాయి జిల్లా

ధర్నాను విజయవంతం చేయండి

● వామపక్ష నాయకులు

ధర్మవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గృహాలకు స్మార్ట్‌మీటర్లు బిగించే ప్రయత్నం, విద్యుత్ చార్జీలు పెంచే ప్రయత్నం మానుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగు మధు, సీపీఎం జిల్లా నాయకుడు జంగాలపల్లి పెద్దన్న ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సీపీఎం స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో స్మార్ట్‌మీటర్లు బిగించి రైతులకు, ప్రజలకు మోయలేని భారాలు వేశారన్నారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుతం వాటిని వ్యతిరేకించినట్లు గుర్తుచేశారు. గృహాలకు స్మార్ట్‌మీటర్లు బిగించే ప్రయత్నం చేస్తే ప్రజాసంఘాలు, వామపక్షాలు ప్రజలను కలుపుకుని పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీటిపై మార్కెట్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు మంగళవారం ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్ బాషా, పట్టణ కార్యదర్శి మారుతి, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

కేసు నమోదు

గాండ్లపెంట, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): గొర్రెలు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించలేదని కడపజిల్లా మైదుకూరు నియోజకవర్గానికి చెందిన ఓ మహిళపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ ఆదివారం తెలిపారు. ఆమె తన వద్ద నుంచి 110 గొర్రెలు తోలుకెళ్లిందని, డబ్బు ఇవ్వకుండా రెండు మూడు నెలలుగా కాయాపన చేస్తోందని గాండ్లపెంట మండలంలోని సీఎం తండాకు చెందిన తిరుపాల్‌నాయక్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, విచారిస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

విద్యార్థి సంఘాలపై నిషేధమా?

● ఉత్తర్వులను వెంటనే వెనక్కు తీసుకోవాలి: ఏఐఎస్‌ఎఫ్

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘాలకు పాఠశాలల ప్రవేశాన్ని నిషేధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్వర్వులు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రంలోని గణేష్‌కూడలిలో ఆదివారం నిరసన చేపట్టారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర మాట్లాడుతూ.. విద్యార్థి సంఘాలు రాజకీయాల కోసం పాఠశాలలకు వెళ్లడంలేదన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, విద్యారంగంలో చేస్తున్న అన్యాయాలను ఎదిరించి, పోరాటాలు చేయడానికే వెళ్తున్నాయన్నారు. అలాంటి విద్యార్థి సంఘాలను పాఠశాలల్లోకి వెళ్లకుండా నిషేధించడం ప్రజాసామ్యాన్ని అణగదొక్కడమేనన్నారు. ఉత్వర్వులను వెనక్కు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు హర్షవర్ధన్, సాయిప్రతాప్, శివ, భరత్, దినేష్, కార్తీక్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతుకు తీవ్రగాయాలు

తనకల్లు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కమతంపల్లికి చెందిన నరసింహులు నాయక్ అనే రైతు శనివారం రాత్రి విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడ్డాడు. తన మొక్కజొన్న తోటకు నీరు పెట్టడానికి వెళ్లి విద్యుత్ ప్రమాదానికి గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. గాయపడిన నరసింహులునాయక్‌ను వందేమాతరం టీమ్ అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు అందించారు. అనంతరం మెరుగైన చికిత్సలకోసం కదిరికి తరలించినట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా, ఫిర్యాదు అందలేదన్నారు.

ఉల్లాసంగా క్రికెట్ పోటీలు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో దివంగత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణ జయంతి సందర్భంగా పట్టణంలోని ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం ఉపాధ్యాయులు స్నేహపూర్వక క్రికెట్ టోర్నమెంటు ప్రారంభించారు. ఈ టోర్నమెంటులో కదిరి పది మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన గాండ్లపెంట జట్టు 4 వికెట్ల నష్టానికి 111 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ ప్రారంభించిన నల్లమాడ జట్టు 7 వికెట్లను నష్టపోయి లక్ష్యాన్ని చేదించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా 35 పరుగులు చేసిన అశ్వత్థ ఎంపికైయ్యారు. రెండో మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన తనకల్లు జట్టు 5 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కదిరి జట్టు పది వికెట్ల తేడాతో విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా 52 పరుగులు చేసిన జబీవుల్లా ఎంపికయ్యారు. ఉత్కంఠ భరితంగా జరిగిన మూడో మ్యాచ్‌లో టాస్ గెలిసి బ్యాటింగ్ చేసిన ముదిగుబ్బ జట్టు 7 వికెట్ల నష్టానికి 92 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేపట్టిన నంబులపూలకుంట జట్టు చివరి బంతి వరకు పోరాడి 4 వికెట్ల నష్టానికి 90 పరుగులుచేసి ఓటమి పాలైంది.

కొత్తచెరువులో నీటి కష్టాలు



ట్యాంకర్ ద్వారా నీటిని తోలించుకుంటున్న దృశ్యం

కొత్తచెరువు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సమీపంలోని బుక్కపట్నం చెరువులో నీరున్నా మండలకేంద్రమైన కొత్తచెరువుకు మాత్రం నీటి కష్టాలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం, బసవన్నకట్టవీధి, గాంధీనగర్, కమ్మపాళ్యం, వడ్డెర వీధి ప్రాంతాలలో పది రోజుల నుంచి పంచాయతీ నీరు సరఫరా కాలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు మార్లు సర్పంచ్, పంచాయతీ ఈఓకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. తాగునీరు సరఫరా కాకపోవడంతో చేసేది ఏమీలేక ట్యాంకర్ల ద్వారా నీటిని తోలించుకుంటు న్నామని గ్రామస్థులు వాపోయారు. ఒక్కో ట్యాంక్ నీటికి రూ.800 చెల్లించి కొనుగోలు చేసుకుంటున్నామని వారు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ ప్రాంతాలకు తాగునీరు సరఫరా అయ్యేవిధంగా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న ఎంపీ బీకే

ముదిగుబ్బ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాతూరుకు చెందిన దిలీప్ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 8,64,764 చెక్‌ను ఎంపీ బీకే పార్థసారధి అందజేశారు. ఎంపీ ఆదివారం అనంతపురంలోని తన నివాసంలో దిలీప్ కుటుంబానికి అందించారు. దీంతో దిలీప్ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎంపీ బీకే పార్థసారధి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

ధర్మవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 9వ తేదీ పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరిప్రదక్షిణ, కాణిపాకం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ధర్మవరం డిపో నుంచి ఈ నెల 8న ఉదయం 6గంటలకు బయలు దేరుతుందన్నారు. రానుపోను చార్జీలు రూ.1400 ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న భక్తులు ముందుగానే ఆన్‌లైన్ లేదా బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9959225859 నంబర్‌కు సంప్రదించాలని డీఎం సూచించారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

బత్తలపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బత్తలపల్లిలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని యువకులు ఘనంగా నిర్వహించారు. అందరూ కలసి కేక్ కట్‌చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా జ్ఞాకాలను నెమరు వేసుకున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

కదిరి అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులివెందల బైపాస్ ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. డీఎస్పీ శివరానాయణస్వామి పర్యవేక్షణలో ఈదాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.72,230 నగదుతో పాటు, ఎనిమిది ద్విచక్రవాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



తాత్కాలిక మరమ్మతులు చేసిన విద్యుత్ స్తంభం

గాండ్లపెంట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్లపల్లిలో విద్యుత్ స్తంభం విరిగిపోయి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందో అని గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని రామాలయం వద్ద విద్యుత్ స్తంభం చాలాకాలం క్రితం విరిగిపోయింది. దీంతో గ్రామస్థులు ఆ స్తంభానికి ఇనుక రాడ్లు అడ్డుగా వేసి పడిపోకుండా తాత్కాలిక మరమ్మతులు చేశారు. అలాగే ఈ స్తంభంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశముందని, అలాగే విద్యుత్ అధికారులు మరో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. విరిగిపోయిన స్తంభాన్ని తొలగించలేదు. తాత్కాలిక మరమ్మతులు చేసిన స్తంభాన్ని తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పాఠాలు నేర్చేరా..?

ఈసారైనా వినాయక విగ్రహాల ఎత్తు తగ్గించేరా..?

పురంలో ప్రారంభమైన విగ్రహాల తయారీ



నిమజ్జనం సందర్భంగా భారీగా పోలీసు బందోబస్తు (ఫైల్)

హిందూపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో వినాయక విగ్రహాల ఏర్పాటు, నిమజ్జన కార్యక్రమానికి ఓ ప్రత్యేకత ఉంది. ఎందుకంటే ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత అత్యంత వైభవంగా వినాయక నిమజ్జనం హిందూపురంలోనే జరుగుతుంది. అయితే నిమజ్జనం గతంలో 1 లేక 2 రోజులు పట్టేది. అయితే రాను రాను మూడు రోజులుకూడా అవుతోంది. గత యేడాది నిమజ్జనం మూడోరోజు ఉదయం కూడా జరగ్గా అంతకు ముందు యేడాది మూడురోజులు పూర్తయినా నిమజ్జనం పూర్తికాలేదు. ఇందుకు పలు కారణాలున్నాయి. ఈసారి ఎలాగైనా విగ్రహాలు నిమజ్జనం ప్రశాంతంగా ఒకేరోజులో జరిగేలా చూసేందుకు కలెక్టర్ వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. అయినా ఆయన ఆదేశాలు మండప నిర్వాహకులు పట్టించుకున్నట్లు కనిపించలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనం ప్రస్తుతం విగ్రహాల తయారీలో చూస్తుంటే తెలుస్తోంది. 20నుంచి 25అడుగుల ఎత్తులో ఉండాలని ఆదేశాలు ఇచ్చినా కొన్ని విగ్రహాలు ఈసారికూడా తరలించే వాహనం ఎత్తుతో పోల్చితే 30అడుగులు దాటేలా ఉన్నాయి.

కలెక్టర్ ఆదేశాలు ఫలించేనా..?

గతంలో వినాయక నిమజ్జనం సందర్భంగా కొన్ని విగ్రహాలు నిర్వాహకుల మధ్య పోటీ పెరిగింది. దీంతో కొన్ని సందర్భాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రెండు విగ్రహాల మధ్య ఏర్పడిన వివాదానికి సంబంధించిన పంచాయతీ రెండురోజులపాటు మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. దీనికారణంగా ఆ విగ్రహాలు రెండు రోజులపాటు మున్సిపల్ కార్యాలయం వద్దే నిమజ్జనానికి వెళ్లకుండా ఆగిపోయాయి. గత యేడాదికూడా కొంతమంది మండప నిర్వాహకులు అర్ధరాత్రి దాటాక విగ్రహాలు ఎక్కడికక్కడ వాహనాలు ఆపేసి ఇళ్లకు వెళ్లిపోయారు. దీనికారణంగా నిమజ్జనం మూడోరోజుకు చేరింది. అంతేకాక పోలీసులు నిమజ్జనం సందర్భంగా హిందూపురంలో చాలా కష్టపడాల్సి ఉంటుంది. ఎందుకంటే విగ్రహాలు ఊరేగింపు వెళ్లే సమయంలో కొంతమంది అనవసరంగా గొడవలకు దిగడం, మరికొంతమంది కయ్యానికి కాలుదువ్వడం ప్రతియేడాది జరుగుతుంటుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఇటీవల కలెక్టర్ మండప నిర్వాహకులను పిలిచి సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా విగ్రహాల్ని తరలించే వాహనంతోపాటు విగ్రహం 20నుంచి 25అడుగుల మధ్యలో ఉండాలని చెప్పారు. అంతకు మించితే ఇబ్బంది పడతారని చెప్పారు. అయినా ఆయన మాటలు బేఖాతరుచేసి విగ్రహాన్ని తయారు చేస్తున్నట్లు స్పష్టంఅవుతోంది.

గత ఏడాది అనుభవాలు ఎన్నో?

హిందూపురంలో వినాయక చవితి పురస్కరించుకుని చిన్న విగ్రహంతో మొదలుకుని పెద్ద విగ్రహం వరకు సుమారు 200కుపైగా ఏర్పాటు చేస్తారు. అయితే ముద్దిరెడ్డిపల్లి, మోతుకపల్లి, కొట్నూరు, సడ్లపల్లి, నింకంపల్లి, టీచర్స్‌కాలనీకి చెందిన విగ్రహాలు ముందుగా నిమజ్జనం చేస్తారు. మిగిలిన విగ్రహాలు 150కిపైగా ఏడవ రోజు నిమజ్జనం చేయడం ఆనవాయితీ. అయితే గత యేడాది విగ్రహాలు మండపాల నుంచి తరలించే సమయం మధ్యాహ్నం దాటింది. ఈ తరుణంలో ఓ విగ్రహం చిన్నమార్కెట్ సమీపంలో కూలిపోయింది. మరో విగ్రహం నిమజ్జనానికి తరలించేందుకు వాహనంపై ఎక్కిస్తుండగానే కిందపడింది. మరో విగ్రహం అయితే గుడ్డం కోనేరువద్ద నిమజ్జనం చేసే సమయంలో నీటిలోకాకుండా గడ్డపైపడి ముక్కలైంది. దీంతో భక్తితో పండుగను ఆచరించాలేకాని విగ్రహాల మధ్య ఎత్తును పోల్చుకుంటే ఇలాగే అవుతుందని పలువురు అంటున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని విగ్రహాలు ఎత్తు తగ్గిస్తారనుకుంటే ఈసారికూడా అదే పరిస్థితి ఉండేలా కనిపిస్తోంది.

ప్రారంభమైన విగ్రహాల తయారీ

హిందూపురంలో వినాయక చవితి పురస్కరించుకుని పెద్ద విగ్రహాల తయారీ ప్రారంభమైంది. ఇప్పటికే పెద్ద విగ్రహాలు సంబంధించి 20చోట్ల కర్ణాటకకు చెందిన విగ్రహాలు తయారుచేసేవారు పనిలో నిమగ్నమయ్యారు. పండగకు కేవలం 20 రోజులుండటంతో పనులువేగంగా జరుగుతున్నాయి. అయితే పోలీసులకు ఇటీవల పడిన కొన్ని కేసుల కారణంగా ఆ కేసులపై తిరుగుతున్నారు. దీంతో వినాయక విగ్రహాల ఏర్పాటు దృష్టి సారించలేదు. దీంతో హిందూపురంలో విగ్రహాల ఎత్తు పెరగడంతో ఇబ్బందులు తలెత్తుతాయి. ముఖ్యంగా రోడ్డు ఇరుకుగా ఉండటం, విద్యుత్‌వైర్లు కిందకు ఉండటం కారణంగా నిమజ్జనంరోజు చాలా ఇబ్బందులు పడాల్సి ఉంది. దీంతోపాటు రోడ్లు ఇంకా గతుకులుగానే ఉన్నాయి. నిమజ్జనం ముగిసేవరకు హిందూపురంలో విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని కలెక్టర్, పోలీసు అధికారులు సమావేశాలు ఏర్పాటుచేసినా ఈసారికూడా మారేలా కనిపించలేదన్నది విగ్రహాల తయారీబట్టి తెలుస్తుంది.

కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు పాటించాలి

గత యేడాది పోలీసులు, పట్టణ ప్రజలు పడిన ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని ఈసారి విగ్రహాల ఎత్తు తగ్గించాలని కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు. ఎత్తు విగ్రహాలు ఏర్పాటుచేస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. భక్తి ఉండాలేతప్ప పోటీపడటం సబబుకాదు. వినాయక మండప నిర్వాహకులు ఇప్పటికైనా ఆలోచించి విగ్రహాల ఎత్తు తగ్గించేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-మహేష్, డీఎస్పీ, హిందూపురం

స్థలం విషయమై ఘర్షణ



ఘర్షణ పడుతున్న దృశ్యం

సోమందేపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతగానిచెరువు గ్రామంలో సర్వేనంబరు 309-2డిలో ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తుల మధ్య స్థల వివాదం నెలకొంది. 18సెంట్ల స్థలంలో ముగ్గురికి ఆరు సెంట్లు చొప్పున భాగాలుండగా వీలునామాలో చిన్న తప్పిదంవల్ల ఇరువర్గాలు వారం క్రితం ఘర్షణ పడ్డాయి. ఈ సంఘటనపై బాధితురాలు పార్వతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. శాసనకోట చిన్నతిమ్మయ్య, లక్ష్మీనరసప్ప బంధువులు. తిమ్మయ్య సంతానం వెంకటేశ్ మృతిచెందాడు. కోడలు పార్వతమ్మ ఆమె కుమారులు చంద్ర, ప్రవీణ్, మహేష్ తమ స్థలంలో ప్రహరీ, బాత్‌రూం నిర్మాణం చేపట్టగా లక్ష్మీనరసప్ప కుటుంబం అడ్డుకున్నట్లు తెలిసింది. దీంతో వారి మధ్య ఘర్షణ తలెత్తింది. ఎస్‌ఐ రమేష్‌ను వివరణ కోరగా బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అరకొరగా పంటల సాగు

నేలరాలని చినుకు

ప్రత్యామ్నాయం వైపు చూపు



కోడూరు వద్ద విత్తుకు సిద్ధం చేసిన పొలం

చిలమత్తూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. వరుణదేవుడు కరుణించకపోవడంతో పంట పొలాలు బీళ్లుగానే ఉండిపోయాయి. జూన్, జూలై మాసాలు పూర్తి అయినా విత్తనాలు విత్తుకునేందుకు అవసరమైన వర్షపాతం నమోదుకాకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. మండలంలో వ్యవసాయశాఖ అధికారుల లెక్కల మేరకు ఈ ఖరీఫ్ సీజన్‌లో అతి తక్కువగా పంట సాగు నమోదైంది. ప్రధాన పంటలుగా ఉన్న వేరుశనగ, మొక్కజొన్న పంటలు సగానికి సగం కూడా సాగవకపోవడం విశేషం. అధికారుల అంచనా ప్రకారం ఈ ఖరీఫ్‌లో వేరుశనగ 450 హెక్టార్లు సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 230 హెక్టార్లు మాత్రమే సాగైంది. మొక్కజొన్న విషయానికి వస్తే 2209 హెక్టార్లు సాగవ్వాల్సి ఉండగా కేవలం 421 హెక్టార్లు, కంది 163 హెక్టార్లకుగాను 14 హెక్టార్లు, వరి 75 హెక్టార్లు సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు ఎక్కడా సాగు కాలేదు. రాగి 20 ఎకరాల వరకు సాగవ్వాల్సి ఉండగా కేవలం 6 హెక్టార్లు మాత్రమే సాగైంది. ఉలవ 25 ఎకరాలకు గాను ఒక ఎకరం సాగైంది. అయితే వర్షాలు లేకపోవడంతో బోరుబావుల ఆధారంగా మాత్రమే అక్కడక్కడ అరకొరగా ఈ పంటల సాగు జరుగుతోంది.

కరుణించని వరుణుడు

ఖరీఫ్‌లో పంటల సాగుకు అవసరమైన వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఊహించని విధంగా కనిష్ట స్థాయిలో నమోదైంది. రుతుపవనాల ప్రభావం లేకపోవడంతో కేవలం ఈదురుగాలులు, కారుమబ్బులు దోబూచిలాడి రైతులను నట్టేట ముంచేశాయి. మే 15వ తేదీ తరువాత ఓ మోస్తారుగా వర్షపాతం నమోదైంది. జూన్ ప్రారంభంలో ఆశాజనకంగా వానలు కురిసినా రెండో వారంలో ఆగిపోయాయి. దీంతో జూన్, జూలై నెలల్లో పంటలు విత్తుకునేందుకు 101.18 మీ.మీ వర్షపాతం అవసరం. అయితే కేవలం 71.84 మి.మీలు కురిసింది. అది కూడా అరకొరగా కురవడంతో విత్తనాలు విత్తుకునేందుకు అవకాశం లేకుండా పోయింది.

ముందుగానే సాగుకు సమాయత్తం

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలో మేలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. వెంటనే పొలాలను ముందస్తుగా చదును చేసుకొని సాగుకు సమాయత్తమయ్యారు. జూన్ ప్రారంభంలోనే పంటలను విత్తుకోవాలని పొలాలను సిద్ధం చేసుకున్నారు. అయితే జూన్ వర్షాలు పడలేదు. దీంతో రైతులు విత్తనాలను విత్తుకోలేకపోయారు. చివరికి జూలైలో విత్తుకుందామని అనుకున్నారు. ఆ నెలలో కూడా వరుణ దేవుడు మొహం చాటేశాడు. రైతుల్లో తీవ్ర నిరాశ అలుముకుంది. విత్తనాలు, దుక్కి చేసుకోవడం వంటి వాటికి పెట్టుబడి పెట్టి ఆకాశం వైపు చూడాల్సి వచ్చింది.

ప్రత్యామ్నాయం వైపు చూపు

ఖరీఫ్‌లో జూన్, జూలై నెలల్లో వర్షం మొండికేయడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆలోచిస్తున్నారు. ఇప్పటికే వేరుశనగ, మొక్కజొన్న పంటల సాగుకు గడువు తీరిపోవడంతో ఇతర పంటల సాగుకు ఆశక్తి చూపుతున్నారు. అయితే ఇప్పటికైనా వర్షం కురుస్తేనే ఉలవ, ఇతరత్ర పంటలననైనా సాగుచేసుకునే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. అయితే ఆగస్టులోనైనా వరుణ దేవుడు కరుణిస్తాడో లేదో చూడాలి.



తీవ్ర కరువు వచ్చేలా ఉంది..

ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆ పదునుతో పొలాలు దుక్కి చేసుకున్నాం. విత్తనాలు విత్తేందుకు సిద్ధం చేసుకున్నాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు చినుకు పడలేదు. ఇప్పటికే వర్షాకాలం సగం ముగిసింది. ఈ ఏడాది పంట సాగుకు అనుకూలించలేదు. తీవ్ర కరువు వచ్చేవిధంగా కనపడతోంది. బోరుబావుల్లో సైతం నీళ్లు అడుగంటుతున్నాయి. ఇప్పటికైనా వాన దేవుడు కరుణించాలి.

-రామిరెడ్డి, కోట్లోపల్లి రైతు



ఉలవ వేసుకోవచ్చు

వర్షాధారంగా వేరుశనగ, మొక్కజొన్న పంటలను విత్తుకునేందుకు సమయం ముగిసిపోయింది. ఇప్పటికైనా వర్షం వస్తే ప్రత్యామ్నాయ పంటలను విత్తుకోవచ్చు. ఏ పంట వేసినా చేతికి అందే పరిస్థితి లేదు. ఒక్క ఉలవ పంట వేసుకోవడానికి అవకాశం ఉంది. ప్రత్యామ్నాయ పంటలను విత్తుకునేందుకు అధికారులు సలహాలు సూచనలు ఇవ్వాలి. ఉలవ పంట ఒక్కటే కొంత వరకు ఉపశమనం కలిగించే పంటగా ఉంది. దీనిని విత్తుకోవాలని అనుకుంటున్నాం. ఇతర పంటలు ఏమైనా ఉంటే అధికారులు తెలియజేస్తే బావుంటుంది.

-శీనా, రైతు, శానగానపల్లి

నీటితొట్లెలు నిర్మించారు..

నిర్వహణ మరిచారు..

నీరులేక ఖాళీగా దర్శనమిస్తున్న పశువుల నీటితొట్లెలు



ఖాళీగా ఉన్న నీటి తొట్టె

సోమందేపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2025-26సంవత్సరానికిగాను 58పశువుల నీటి తొట్లెలు మంజూరయ్యాయి. ఇందులో 49 నిర్మాణాలు పూర్తయ్యాయి. ఒక్కో నీటితొట్టెకు రూ.33వేలు ఖర్చుచేశారు. నిర్మాణాలుపూర్తిచేసి చేతులు దులుపుకున్నారు. నీటితొట్లెలు నిర్లక్ష్యంగా వదిలేయడంతో నీరులేక పశువులు ఇబ్బందులు పడుతున్నాయి. చాలా ప్రాంతాల్లో నీటి తొట్లెలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో పశువుల కాపర్లు, గొర్రెల కాపర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొట్లెలను నిర్మించారు వదిలేశారు. ఇలా అయితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఎస్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన నీటితొట్లెల లక్ష్యం నీరుగారుతోంది. నీరు నింపే విషయంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో అవి ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఆదివారం మండలంలోని కొత్తపల్లి గ్రామ చెరువులో పలువురు పశువుల కాపర్లు, గొర్రెల కాపర్లు నీటిని తాపేందుకు తొట్టెవద్దకు వెళ్లగా నీరు లేదు. దీంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సమీప ప్రాంతాల్లో నీరు ఎక్కడాలేకపోవడంతో పక్క గ్రామాలకు వెళ్లి నీటిని తాపించినట్లు తెలిపారు. ఈ సమస్యను వీడియోద్వారా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తొట్లెల్లో నీరు నింపాలని వారు కోరారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి తొట్లెలను నీటితో నింపి పశువుల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.

ఉపాధి హామీ కూలీలకు జమకాని బిల్లులు

రెండు నెలలైనా అందని డబ్బు

కుటుంబ పోషణ భారమంటున్న కూలీలు

వెంటనే చెల్లించాలంటూ వేడుకోలు




ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

మడకశిర, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసి పది వారాలు పైబడుతున్నా కూలీల ఖాతాలోకి నేటికీ బిల్లులు జమకాకపోవడంతో వారు ఆవేదన చెందుతున్నారు. అప్పులు చేసి జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొందని అంటున్నారు. పనిచేసినా డబ్బు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి తలెత్తిందని చెబుతున్నారు. మే 29 వరకు కూలీలకు డబ్బులు ఖాతాలలోకి జమ అయ్యాయి. ఆ తరువాత జమకాలేదు. దీంతో తాము ఎలా కుటుంబాలను పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు రూ.78 కోట్లు దాకా బిల్లులు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో రెండు లక్షల మందికి పైగా జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 1.23 లక్షల జాబ్‌కార్డులకు సంబంధించి కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారు. జూన్ 15వ తేదీ వరకు ఉపాధి పనులకు కూలీలు 50వేల నుంచి 70 వేల మంది దాకా వచ్చేవారు. రెండు నెలలు అయిన ఉపాధి బిల్లులు చెల్లించకపోవడంతో పనులకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోంది. వర్షాభావం కారణంగా వ్యవసాయ పనులు లేకపోవడం, పనులు చేసినా ఉపాధి బిల్లులు చెల్లించకపోవడంతో జీవనం కూడా కష్టసాధ్యంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, ఎండ కాలంలో ఎండకు ఎండాల్సిందే, వానకాలంలో వర్షాలకు తడవాల్సి వస్తోందని కూలీలు వాపోతున్నారు.. గతంలో పనులు చేసేందుకు కొంత అనుకూలంగా ఉన్నా చేసిన పనులకు బిల్లులు ఖాతాలలోకి జమకావడంలేదని వారు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఇలాగే బిల్లు చెల్లించడం ఆలస్యమైతే అప్పులు కూడా పుట్టడం కష్టంగా మారుతుందంటున్నారు. పనులు చేసిన సకాలంలో బిల్లులు అందక పోవడంతో పస్తులు ఉండే పరిస్థితి నెలకొందని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని, విధిలేని పరిస్థితులో పనులకు ఇతర పనులకు వెళ్లక తప్పడంలేదని కూలీలు అంటున్నారు.. బిల్లుల కోసం కార్యాలయం చూట్టు తిరగాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు. వెంటనే చెల్లించాలని వేడుకుంటున్నారు.

వ్యవసాయ పనులూ అంతంత మాత్రమే..

గతంలో ఎన్నడు లేని విధంగా వర్షాభావం నెలకొనడంతో వ్యవసాయ పనులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి.. మడకశిర నియోజకవర్గంలో ఎటువంటి సాగు నీటి వనరులు, పరిశ్రమలు లేక పోవడంతో కూలీలకు ఎటువంటి ఉపాధి అవకాశాలు లేవు. చాలా మంది కూలీలు ఉపాధి హామీ పథకంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం పంటలు దెబ్బతినడం సాగు విస్తీర్ణం తగ్గిపోవడం కారణంగా స్థానింగా గ్రామాలలో వ్యవసాయ పనులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని అంటున్నారు.



ఆరు వారాల డబ్బు జమ కాలేదు

ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేసిన సకాలంలో బిల్లులు రావడంలేదు. పనులు చేసి ఆరు వారాలు అవుతున్నా డబ్బులు ఖాతాలోకి జమకాలేదు. ఇంతకు మునుపు వారానికి రెండు వారాలకు బిల్లులు ఖాతాలోకి జమ చేసేవారు. ప్రస్తుతం ఆరు వారాలు అయినా బిల్లులు జమ కాలేదు. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పనులు చేసే చోట వసతులు కల్పించడం లేదు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించాలి.

- కాంతరాజు, మల్లినమడుగు

రూ.78 కోట్ల దాకా బిల్లులు చెల్లించాలి

ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు ఆరు వారాలకు సంబంధించిన బిల్లులు చెల్లించాల్సి వుంది. జిల్లాకు సంబంధించి రూ. 78 కోట్ల దాకా చెల్లించాలి. నిధులు విడుదల అయిన వెంటనే కూలీల ఖాతాల్లోకి జమ అవుతాయి.

- విజయేంద్రప్రసాద్, పీడీ, డ్వామా

గణపయ్యలు వచ్చేశారు..



విక్రయానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు

పెనుకొండ రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ సమీపిస్తుండటంతో విగ్రహాల విక్రయాలు ఊపందుకుంది. ఇందులో భాగంగా పట్టణంలో ఇప్పటికే తయారు చేసిన భారీ వినాయక విగ్రహాలను విక్రయించేందుకు ఉంచారు. భారీస్థాయిలో ఉన్న వినాయక విగ్రహాలను వ్యాపారులు ఇప్పటికే మండలవ్యాప్తంగా ఉంచారు.

బాధ్యతాయుతమైనది పోలీసు వృత్తి

- మంత్రి సవిత



మంత్రి సవితతో ఉత్తీర్ణత సాధించిన కానిస్టేబుళ్లు

పెనుకొండ టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన వృత్తి పోలీసు అని మంత్రి సవిత అన్నారు. నీతి నిజాయితీతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇటీవల కానిస్టేబుల్ ఫలితాల్లో ఉద్యోగం పొందిన నియోజకవర్గానికి చెందిన 25 మందికి మంత్రి సన్మానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కృషి పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. మీ తల్లిదండ్రుల కలలను నెరవేర్చడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగ రీత్యా మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, కన్వీనర్ శ్రీరాములు, సోము (రాయలసీమ నాగార్జున), బాబుల్ రెడ్డి, సమి తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు జట్టు ఘన విజయం



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న రజాక్

చిలమత్తూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పెనుకొండలో ఆదివారం నిర్వహించిన టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో చిలమత్తూరు టీచర్స్ జట్టు ఘన విజయం సాధించింది. పోటీలో చిలమత్తూరు, గోరంట్ల జట్లు పోటీ పడగా చిలమత్తూరు జట్టు విజేతగా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన గోరంట్ల జట్టు 12 ఓవర్లలో 83 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కి వచ్చిన చిలమత్తూరు జట్టు 8 ఓవర్లలో 84 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో 41 పరుగులు చేసిన రజాక్ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు.

ఎమ్మెల్యే చొరవతో కార్మికులకు వేతనాలు



హర్షం వ్యక్తం చేస్తున్న నీటి కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): హిందూపురానికి తాగునీటి పైప్‌లైన్ గొల్లపల్లి వాటర్ వర్కర్స్ సమస్య పరిష్కారమైందని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ అన్నారు. ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఆరు నెలల వేతనాలు వర్కర్స్‌కు అందాయని ఇందుకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవే కారణమన్నారు. వర్కర్స్ సమస్యను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారం అయిందన్నారు. ఇకమీదట వర్కర్స్‌కు రెగ్యులర్‌గా జీతాలు అందించాలని ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని కోరారు.

తెగిపడిన విద్యుత్ తీగ

- తప్పిన ప్రమాదం



తెగిపడిన విద్యుత్‌తీగ

సోమందేపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ్రాయనపల్లి వద్ద ఎన్టీఆర్ కాలనీ గృహాలపై ఆదివారం 11కేవీ విద్యుత్‌లైను తెగిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులుతీశారు. కాలనీ మీదనుంచి వెళ్లిన విద్యుత్ తీగ ఒకసారిగా తెగిపడింది. అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. సమాచారాన్ని విద్యుత్‌శాఖ అధికారులకు చేరవేయడంతో వారు సకాలంలో స్పందించి సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజాస్వామ్యానికి విరుద్ధం

- ఏఐఎస్ఎఫ్ నాయకులు



జీవో ప్రతులను దహనం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిందూపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాల ప్రవేశానికి నిషేదిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. ఆదివారం ప్రభుత్వం ఇచ్చిన పత్రాలను దగ్ధం చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు నరసింహామూర్తి ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హక్కులు హరించేలా పాఠశాలలో విద్యార్థి సంఘాలు ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేదిస్తూ ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, హక్కుల కోసం విద్యార్థి సంఘాలు పోరాటం నిర్వహించడం దశాబ్దాలుగా వస్తోందన్నారు. అయితే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం విడ్డూరమన్నారు. ఇది కార్పొరేట్ విద్యాసంస్థలకు లాభం చేకూరేలా ఉందన్నారు. అనంతరం జీవో ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు చంద్రశేఖర్, అలీ, వినిత్, ఖలందర్, ప్రభాకర్, దీపక్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న టెంపో వాహనం

ఇద్దరికి తీవ్రగాయాలు

మడకశిర రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాల్మీకి సర్కిల్ వద్ద నిలబడిన లారీని వేగంగా టెంపో ఢీకొని పక్కనే ఉన్న షాపులోకి దూసుకెళ్లింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.